క్లుప్తంగా

నేటి ప్రారంభోత్సవాలు వాయిదా

శాయంపేట : నేడు (సోమవారం) మండలంలోని జోగంపల్లి, కొప్పుల గ్రామాల నడుమ తలపెట్టిన బ్రిడ్జి, కొప్పులలో ఎస్సీ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాలు వాయిదా వేసినట్లు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ గుండెపోటుతో మరణించిన క్రమంలో సంతాపం ప్రకటిస్తూ మండలంలో ఎమ్మెల్యే పర్యటనను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. త్వరలోనే ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్టు వివరించారు.

నివాళి



ఐనవోలు : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల సంపత్ అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందగా ఆయన మృతదేహానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని రవీందర్‌రావు, మధుమతి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట రైతుబంధు మండల కోఆర్డినేటర్ మునిగాల సమ్మయ్య, నాయకులు బుర్ర రాజశేఖర్ తదితరులున్నారు.

రక్తదాన శిబిరం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తా సమీపంలోని పింజర్లవీధిలో గల జోయాలుక్కాస్ జ్యువెల్లరీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శిబిరంలో జోయాలుక్కాస్‌కు చెందిన 30మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఎంజీఎం రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో జోయాలుక్కాస్ మేనేజర్ మింటో డోమినిక్, అసిస్టెంట్ మేనేజర్ డోబిలా వినయ్, సంతోష్, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వాగ్దేవి'లో జాబ్‌మేళా



హన్మకొండ చౌరస్తా: మాజీ మంత్రి, దివంగత ప్రణయ్‌భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో సోమవారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ కోరారు. ఈమేరకు జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంఖ్యలో వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తక్కళ్లపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ సంఘం బాధ్యులు పరకాల కుమారస్వామి, బొజ్జ చంద్రమౌళి, బూర గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

రాయపర్తి : కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల అభివృద్ధి కార్యక్రమాలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఈనెల 13న పాలకుర్తి నియోజకవర్గ స్థాయి సీనియర్ బీజేపీ నాయకులు, కార్యకర్తల సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. బీజేపీ, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్, రాయపర్తి మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె అనిల్, కార్యదర్శి రాపాక ప్రశాంత్, నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్, నాయకులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ

దామెర : డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. మండల కేంద్రంలో పూర్వ బీజేపీ, సీనియర్ కార్యకర్తల సమ్మేళనం ఆదివారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని సూచించారు. కేంద్రం కేటాయిస్తున్న నిధులతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతూ కేంద్రాన్నే విమర్శించడం సరికాదన్నారు. సీనియర్ కార్యకర్తలను బలమైన పునాదిగా అభివర్ణించారు. పార్టీ అభివృద్ధిలో నాయకులు, కార్యకర్తల కృషి మరవలేనిదని కొనియాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా యువ నాయకత్వం పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్ గౌడ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, పరకాల నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఒంటేరు జయపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణ, డాక్టర్ సిరంగి సంతోశ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంతి లాల్, కొండి జితేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

కమలాపూర్ : క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్‌కుమార్ తెలిపారు. మండలానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. చేయూత అందక గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులు వెనుకబడి పోతున్నారని తెలిపారు. వారిని ప్రోత్సహిస్తే అత్యున్నత స్థాయిలో రాణిస్తారని చెప్పారు. క్రీడాకారులు క్రీడారంగంలో ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన మాట్ల కుమార్, పుల్ల రాజేష్, కొయ్యడ సునీల్ రూ.2 వేలు చొప్పున కేటాయించి క్రికెట్ క్రీడాకారులకు మూడు బ్యాట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొలుగూరి రాము, హఫీజ్, మాట్ల మహేశ్వర్, క్రీడాకారులు శనిగరపు భానుప్రసాద్, జవహర్, నిశాంత్, రంజిత్, ప్రశాంత్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో పుల్ల వినోద్‌కుమార్, తదితరులు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కమలాపూర్ : దివ్యాంగుల చైతన్య సమాఖ్య వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బోయిని సంపత్ మాట్లాడారు. దివ్యాంగులకు వెయ్యి రూపాయలు చొప్పున పింఛన్ పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేదిక మండల అధ్యక్షుడు శనిగరపు జనార్దన్, నాయకులు సుకినే కోటేశ్వర్‌రావు, ఆడెపు ప్రభాకర్, భాగ్య, దండెవేని కొంరయ్య, గుండెకారి రాజేశ్వర్‌రావు, మేకల మొగిలి, ఇనుగాల మొగిలి, తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

చదువుల్లోనూ ఆరె కులస్తులు రాణించాలి

హన్మకొండ : చదువుల్లోనూ ఆరె కులస్తులు ముందుండాలని ఆరె సంఘం హనుమకొండ జిల్లా ముఖ్య సలహాదారులు పేర్వాల లింగమూర్తి, కుడ్ల మనోహర్ రావు, ఆరెకుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి సూచించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన ఆరె కుల విద్యార్థుల సన్మాన కార్యక్రమాన్ని హనుమకొండ బాలసముద్రంలోని ఆరెకుల సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరె కులస్తుల సర్వతో ముఖాభివృద్ధికి సంఘం పనిచేస్తోందని వివరించారు. విద్యార్థులు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆరె కుల సంఘం హనుమకొండ మండల అధ్యక్షుడు శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు కుసుంబ శ్రీనివాస్, నాయకులు వాడికారి రాజు, కొల్లూరి రవీందర్‌రావు, అంబిరిపురి నర్సింగరావు, సుధాకర్, లోనె దీపక్, హింగే భాస్కర్, వాడికారి లక్ష్మణరావు, పేర్వారం విజయలక్ష్మి, హింగే మనోహర్ రావు, పేర్వారం శంకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

సమాజంలోని అభాగ్యులను ఆదుకోండి

వరంగల్ చౌరస్తా: అభాగ్యులను ఆదుకోవాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ప్రెసిడెంట్ తోట నరసయ్య లింగం సూచించారు. వరంగల్ పిన్నావారి వీధిలోని వాసవి భవన్‌లో క్లబ్ రీజియన్ -4 అధ్యక్షుడు వల్లాల పృథ్వీరాజ్ అధ్యక్షతన రీజియన్ మీట్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో క్లబ్‌లు ముందంజలో ఉండాలని కోరారు. కవులు, కళాకారులు, పేదలు, విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. పేద నిరుద్యోగి గంగిశెట్టి శ్రీనివాస్‌కు రూ.20 వేల వడ్డీలేని రుణం అందజేశారు. బలగం సినిమాలోని జీవీ.బాబు రావు, వేముల ప్రభాకర్‌ను సన్మానించారు. ఈనెల 24, 25వ తేదీల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రీజియన్ చైర్మన్ డాక్టర్ పృథ్వీరాజ్ రాజు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గుండా సంతోష్, ఎలిశాల ఆనంద్, సత్యనారాయణ రావు, గుంటూరు వెంకటనారాయణ, పుల్లూర్ కిషోర్, వల్లా శైలజ, బొడ్ల మోహన్, వాసవి క్లబ్ వరంగల్, వాసవి క్లబ్ ప్రతాపరుద్ర, వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ అభ్యుదయ సభ్యులు పాల్గొన్నారు.



నటులను సన్మానిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక

హన్మకొండ: మున్నూరుకాపు సంఘం 30వ డివిజన్ కమిటీని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దాస్యం వినయ్‌భాస్కర్, గౌరవ ఉపాధ్యక్షుడిగా రావుల కిషన్, అధ్యక్షుడిగా బోనాల వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా పోలు మల్లికార్జున్, కోరబోయిన విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జూకంటి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా తోట తిరుమల్, కొమురవెల్లి శ్రీనివాస్, కార్యదర్శులుగా దేవేందర్, కాసర్ల దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తోట కుమారస్వామి, గోలి శ్రీనివాస్, కోశాధికారిగా మనపల్లి శ్యామ్ ఎన్నికయ్యారని రవికుమార్ వివరించారు. గౌరవ సలహాదారులుగా డాక్టర్ అప్పల సుధాకర్, సుంకరి మల్లయ్య, నరెడ్ల కోటయ్య, మెట్టు మల్లికార్జున్, గందె కృష్ణ, బొల్లం వెంకటేశ్వర్లు, మాదాసు మొగులయ్య, సుంకరి రాఘవేందర్, మిద్దెల బాబు, కర్రు దశరథ్ కుమార్, డాక్టర్ పవన్ ఎన్నికయ్యారు.



బోనాల వీరస్వామి, అధ్యక్షుడు



జూకంటి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాశిబుగ్గ: రైలుకింద పడి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ వెంకటేశ్వర కాలనీకి చెందిన బేతి రవీందర్‌రెడ్డి (55)ని అతని భార్య, కుమారుడు విడిచిపెట్టి వెళ్లిపోయారు. దాంతో హనుమకొండలోని లింగాల కేదారి ఫుడ్‌కోర్టులో వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసైన రవీందర్‌రెడ్డి.. అనారోగ్యం, ఆర్థికపరమైన సమస్యలతో జీవితంపై విరక్తి చెంది వరంగల్ - కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య అండర్‌బ్రిడ్జి సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్నాయత్నానికి శుక్రవారం ప్రయత్నించగా తీవ్రగాయాలతో ట్రాక్ పక్కన పడి ఉన్నాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి రవీందర్‌రెడ్డి చెందాడు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి మేనల్లుడు రాజిరెడ్డికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

నేటి 2కే రన్‌ను విజయవంతం చేయాలి

పరకాల/ఆత్మకూరు : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నేడు (సోమవారం) తలపెట్టిన నియోజకవర్గ స్థాయి 2కే రన్‌ను విజయవంతం చేయాలని పరకాల సీఐ పుల్యాల కిషన్, ఆత్మకూరు ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. పరకాలలోని ఏసీపీ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రన్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రన్‌లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. ఆయా మండలాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.

పింఛన్ పెంపుతో దివ్యాంగులకు భరోసా

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రూపాయలు చొప్పున పింఛన్ పెంచడంతో వికలాంగుల కుటుంబాలకు భరోసా లభించిందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు పెండెల భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పింఛన్ పెంచడం ద్వారా వికలాంగుల కుటుంబాలకు భద్రత కల్పించారని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు వికలాంగులు, వారి కుటుంబాలు రుణపడి ఉంటాయని తెలిపారు. వికలాంగులు ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతుండడం హర్షణీయమని చెప్పారు.

పల్లె రవికుమార్‌కు సన్మానం

హన్మకొండ: తెలంగాణ కల్లుగీత పారిశ్రామిక, ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌ను తెలంగాణ గౌడ సంఘం నాయకులు కలిశారు. హనుమకొండ నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో పల్లె రవికుమార్ గౌడ్‌ను తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకిరకంటి మోహన్ గౌడ్, నాయకుడు మోహన్ గౌడ్ ఆదివారం కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలి

వర్ధన్నపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరునికి ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రొడ్డ మురళీకృష్ణ అన్నారు. గడప గడపకు ధర్మ సమాజ్ పార్టీ పరిచయ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు అందరూ కలిసి రావాలని కోరుతూ కరపత్రాన్ని ఆదివారం మండలంలోని కట్ర్యాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడారు. తెలంగాణలోని మూడు కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆధ్వర్యంలో రాజ్యస్థాపన కోసం గడపగడపకు ధర్మసమాజ్ పార్టీని పరిచయం చేయడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల ప్రశాంత్, కొండేటి బాస్కర్, ముత్యాల దీపక్, ఇరుకు సామేల్, ఎలికట్టి రాజు, దుప్పెల్లి రమేష్, ఎలికట్టి సాయి, జీవన్, శ్రీనివాస్, షణ్ముఖ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ

వర్ధన్నపేట: మండలంలోని ల్యాబర్తి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పిన్నింటి కౌసల్య, తక్కళ్లపెల్లి యశోద, పాలెపాక దిలీప్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ ఆదివారం ఆయా కుటుంబాలను పరమార్శంచి సానుభూతిని ప్రకటించి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీ దయాకర్ వెంట సర్పంచ్ పస్తం రాజు, నర్సింహరావు, జయరాజు, మన్నూరు సోము, ప్రశాంత్, వెంకన్న, గుడికందుల రాజు, రవి, ఎల్లయ్య బూగిద బాస్కర్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడికి గాయాలు

ఖిలా వరంగల్: నిర్మాణంలో ఉన్న భవనం పైఅంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిన కార్మికుడికి తీవ్ర గాయలయ్యాయి. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లోని ఏకశిలనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలానికి చెందిన జలగం రాజు తన భార్య పిల్లలతో కలిసి నగరంలోని వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌కు ఏడాది క్రితం వలస వచ్చాడు. భవన నిర్మాణానికి నీళ్లు కొట్టేందుకు దంపతులిద్దరు పని కుదుర్చుకున్నారు. రోజువారీగా ఆదివారం మధ్యాహ్నం భవనం పైఅంతస్తులో నిర్మాణానికి నీళ్లు కొడుతుండగా రాజు ప్రమాదవశాత్తు అక్కడి నుంచి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన భవన నిర్మాణ కార్మికులు, స్థానికులు రాజును హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది. రాజు పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. కార్మికుడు భవనం నుంచి పడి గాయాలపాలు కావడంతో కలకలం చోటు చేసుకుంది.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్కతుర్తి : నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు



శాయంపేటలో..



ఐనవోలులో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములుకనూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతా ఒకచోట కలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయను చాటారు. అనంతరం నాటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు సదాశివరెడ్డి, ప్రభాకర్, రమేశ్, కొమురయ్య, శ్రీనివాస్, విక్రమ్‌కుమార్, సదాలక్ష్మి, అనిత, ఆశాలత, సంపత్, రవీందర్, నాగిరెడ్డి, రజనీ, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని నవోదయ హైస్కూల్‌లో 2001–02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు హనుమకొండలోని ల్యాండ్ మార్క్ హోటల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకే వేదికగా కలుసుకోని తామ చదువుకున్న రోజుల నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులైన మామిడి రమేశ్, సామల రామ్మూర్తి, బాసాని కోటి, చకిలం సూర్యప్రకాశ్, మార్త వేణులను శాలువా మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొండబత్తుల సతీశ్, ఈగ దేవేందర్, క్యాతం వెంకటరమణ, రాజేశ్ పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు ప్రభాకర్, జనార్దన్ రెడ్డి, రాజేందర్, దశరథం, పరిపూర్ణచారి, కిషన్ రావు, చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తుది దశ పోటీలకు విద్యార్థుల ఎంపిక

న్యూశాయంపేట : విద్యార్థుల సృజనాత్మకతను పెంచేందుకు రాష్ట్ర ఇన్నోవేషన్ ఇంక్విలాబ్ ఫౌండేషన్, యూనిసెఫ్, తెలంగాణ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ తుదిదశ రాష్ట్రస్థాయి పోటీలకు హనుమకొండ జిల్లా పరిధిలోని ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ వద్ద గల హనుమకొండ (బీ–1) ఒకేషనల్ మైనారిటీ గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీష్ ఆదివారం వివరాలు వెల్లడించారు. గురుకులానికి చెందిన సాయి ప్రజ్వల్, ఇర్ఫాన్ అక్మల్, అబ్దుల్ సమీ, యాజిలాని విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో రూపొందించిన ఎలిఫెంట్ లెగ్స్ అంశం రాష్ట్రస్థాయి తుది పోటీలకు ఎంపికైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి వందల ఆలోచనలు రాగా తుది పోటీకి 70 మంది విద్యార్థులను ఎంపిక చేశారని వివరించారు. తుది పోటీలు హైదరాబాద్‌లో ఈనెల 22, 23వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు. సైనికులు విపత్తుల్లో ఉన్నపుడు ఎలిఫెంట్ లెగ్స్ ద్వారా వారి సమాచారం తోటి బృందానికి, పైఅధికారులకు అందుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల బృందానికి మెంటార్లుగా ఉపాధ్యాయులు పి.మూర్తి, వనితలతో పాటు అధ్యాపకుడు కె.సందీప్ వ్యవహరిస్తారని తెలిపారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు

రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన

కరీమాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆరోపించారు. 40వ డివిజన్ ఉర్సు దర్గ, చెట్లగడ్డ ప్రాంతంలో గడపగడపకు బీజేపీ.. ప్రతీ గుండెకు బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. అభివృద్ధిలో పాలకులు విఫలమయ్యారని ఎద్దేవాచేశారు. అబద్ధపు మాటలు, వాగ్దానాలు చేసి రెండవసారి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. నగరంలో భూకబ్జాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ తోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, ప్రదీప్‌రావు సమక్షంలో పలువురు నాయకులు బీజేపీలో చేరగా ఆయన వారిని కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రదీప్

గురుకుల పాఠశాలల్లో చేర్పించాలి

న్యూశాయంపేట: మైనార్టీ విద్యార్థులను గురుకుల పాఠశాలల్లో చేర్పించి కార్పొరేట్ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇంగ్లిష్ మీడియం విద్యను వినియోగించుకోవాలని 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్ కోరారు. డివిజన్ పరిధిలోని మగ్దుం మొహియొద్దీన్ కాలనీలో తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ(టెమ్రిస్) వరంగల్ కౌన్సిలర్ సర్వర్ మొహియొద్దీన్‌తో కలిసి సంబంధిత కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సుశిక్షితులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు గురుకులాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ఉజ్వల భవిష్యత్ కోసం పిల్లలను గురుకులాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో రంగశాయిపేట శివారు వరంగల్ (బీ–1) గురుకులం అధ్యాపకులు, హనుమకొండ గురుకులం స్టాఫ్‌నర్స్, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కుమార్

ఓ సిటీలో ప్లాట్ల వేలాన్ని అడ్డుకుంటాం

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ ఓసిటీలో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న కుడా ప్లాట్ల వేలంపాటలను అడ్డుకుంటామని ఓసిటీ సాధారణ సభ్యులు తీర్మానించారు. ఈమేరకు ఓ సిటీ క్లబ్ హౌస్‌లో ఉపాధ్యక్షుడు శంకర్‌రావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసిటీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కుడా అధికారులు హామీ ఇచ్చి వేలంలో ప్లాట్లు అమ్ముకున్నారని అన్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాఘవరావు, అజయ్‌బాబు, లక్ష్మి, నర్సయ్య, ఓసిటీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఓ సిటీ జనరల్ కౌన్సిల్ సభ్యులు